సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శుక్రవారం | 19 జులై 2024 | పేజీలు 8

# శ్రీశైలంలో చిరుత కలకలం


శ్రీశైలంలో చిరుత సంచరిస్తున్న దృశ్యం

**శ్రీశైలం, మేజర్ న్యూస్ :**

శ్రీశైల క్షేత్రంలోని పాతాళ గంగ పాత మెట్ల వద్ద అర్ధరాత్రి సమయంలో చిరుత కలకలం రేపింది. అర్ధరాత్రి సమయంలో నివాస గృహాల సమీపాలనలోకి వచ్చి నాలుగు కుక్కలను ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. శ్రీశైలంలో వరుస పలుచోట్ల చిరుత కలకలం రేపడంతో భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ఫారెస్ట్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

మిగతా 2లో

## మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- అభివృద్ధి పనుల భూమి పూజలో మంత్రి టి.జి. భరత్
- రూ.2 కోట్లకు సంబంధించి తొలి శంకుస్థాపనలో మంత్రి, ఎంపీ

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. గురువారం 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో రూ.20 లక్షలతో సిసి డ్రైనేజీ కాలువలు,రూ.39 లక్షలతో సిసి రోడ్లు, 17వ వార్డు చాణక్యపూరి

మిగతా 2లో


మౌళిక సదుపాయాల కల్పన శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి టి.జి,ఎంపి నాగరాజు

'కొంతమంది యువకులు ముందు యుగం దూతలు' అన్న శ్రీ శ్రీ మాటలను.. 'ముక్క, చుక్క వదిలేసి భవితవ్యం వైపు చుక్కాని అవ్వండి' అన్న వివేకానందుడి మాటలను ఒకసారి మననం చేసుకోవాలి. అఖండ భారత నిర్మాణం కోసం నడుం కట్టి అసువులు బాసిన యువత నడయాడిన గొప్పదేశంమనది..అలాంటి దేశంలో ఈరోజు కొంతమంది యువత గ'మ్మత్తు'గా బ్రతికేందుకే మొగ్గు చూపుతుందేమోనన్న సందేహం కలగక మానదు. ఇప్పుడిదే గమ్మత్తు నగరాలను దాటి పట్టణాలు,మండలాలు, గ్రామాలకూ పాకింది. 'యువత చెడిపోయేం దుకు కాదేది అనర్హం' అన్న చందంగా చదువుకోవలసిన వయస్సులో చెడు వ్యసనాల బారిన పడుతూ యుక్తవయసులోనే అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్న ఉదంతాలు మన కళ్లకు కనిపిస్తున్నాయి. చిన్న పిల్లలు, యువత, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా 'నిక్కరు' వేసుకున్న 20 ఏళ్లలోపు పిల్లలను సైతం 'లిక్కరు' అనే మహమ్మారి అందరికీ చుట్టుకుంటోంది. మన దేశంలో మద్యం సేవించా లంటే కనీసం 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అయితే 21 సంవత్సరాలు ఖచ్చితంగా పూర్తి అవ్వాల్సి ఉంటుంది. కాలేజీలకు వెళ్లి పుస్తకాలు పట్టుకోవాల్సిన చేతులతో మద్యం బాటిళ్లు పట్టుకుని తప్పటడుగులు వేస్తున్న ఘటనలు ప్రస్తుతం ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక ఇదే విషయానికి వస్తే.. కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మద్యం షాపులలో పిల్లలకు మద్యం అమ్మబడదు అని బోర్డులు మనకు అక్కడక్కడా దర్శనమిస్తుంటాయి. మద్యం షాపులలో సాధారణ మందు బాబులకు మద్యాన్ని విక్రయిస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా 18ఏళ్లు నిండని పిల్లలకు కూడా మద్యాన్ని విక్రయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:**

## లిక్కరు కిక్కులో
# నిక్కరు బాబులు

- కాలేజీకి వెళ్లి పుస్తకాలు పట్టుకోవాల్సిన చేతుల్లో మద్యం బాటిళ్లు
- యథేచ్ఛగా మద్యం షాపులలో మైనర్ పిల్లలకు విక్రయాలు
- 21 సంవత్సరంలోపు వారికి మద్యం అమ్మకూడదన్న నిబంధనలకు తూట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మద్యం, బాల్య యవ్వనం కలిసిపోతే నేర ప్రమాదాలు తప్పవు అంటున్న సామాజిక నిపుణులు


2లో
పెద్దకడబూరులో మద్యం కొనుక్కుని వెళుతున్న మైనర్లు దృశ్యం

## జూరాలకు మొదలైన వరద

- తుంగభద్రకు 71,682 క్యూసెక్కులు


సోమవారం నుండి వరద నీరు వచ్చే అవకాశం ఉండడంతో సంగమేశ్వరం ఆలయం వద్ద చలువ పందిళ్లను తొలగిస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** జూరాలకు వరద మొదలైంది. బుధవారం కర్ణాటకలోని నారాయణ్‌పూర్ డ్యాం 12 గేట్లను తెరిచి దిగువకు 37,260 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.. దీంతో జూరాల ప్రాజెక్టుకు 2,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం పూర్తిస్థాయి సామర్థ్యం9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం

మిగతా 2లో

రాష్ట్రంలో ల్యాండ్ గ్రాబింగ్

## చట్టాన్ని తీసుకువస్తాం

వార్త 8లో

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో

## తగ్గిన త్రాగునీరు..!

వార్త 7లో

## సమస్యల పై గళం విప్పేరా?

- నేడు జడ్పీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- వ్యవసాయం,త్రాగునీరు,సాగునీరు అంశాల పై చర్చిస్తారా?


జిల్లా పరిషత్ కార్యాలయం

శాస్త్రీయ పద్ధతిలో

## నీటి సంరక్షణ పనులు

- ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమీషనర్ చిత్తరంజన్ దాస్



సమావేశంలోఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమీషనర్ ,కలెక్టర్ జేసి,నగర కమీషనర్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** శాస్త్రీయ పద్ధతిలో నీటి సంరక్షణ పనులను చేపట్టాలని ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమీషనర్ చిత్తరంజన్ దాస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జలశక్తి అభియాన్ కు సంబంధించి ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయ

మిగతా 2లో

విద్యుత్ బిల్లు కట్టాలంటే

## క్యూలో నిలబడాల్సిందే..!


క్యూలో నిల్చున్న వినియోగదారులు

పని చేయని ఏపీఎస్పీడీసీఎల్ యాప్
నో యూపీఐ..ఓన్లీ క్యాష్ అంటున్న విద్యుత్ సిబ్బంది
ఇబ్బందుల్లో వినియోగదారులు

2లో

# శాస్త్రీయ పద్ధతిలో నీటి సంరక్షణ పనులు

(మొదటి పేజి తరువాయి)


సమావేశంలో హాజరైన అధికారులు

అనుబంధ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తో కలిసి ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమీషనర్ చిత్తరంజన్ దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వామా, గ్రౌండ్ వాటర్, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాల గురించి ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ కమీషనర్ చిత్తరంజన్ దాస్ కు వివరించారు. అనంతరం చిత్తరంజన్ దాస్ మాట్లాడుతూ నీటి సంరక్షణ పనులను విరివిగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని విధాలా నిధులను వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకుప్రత్యేకంగా టాయ్ లెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. డ్వామా ద్వారా ప్రస్తుతం జరుగుతున్న 747 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కృషి విజ్ఞాన్ కేంద్రం ద్వారా రైతులకు భూమి నాణ్యత, ఎరువులకు, నీటి నిల్వలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి ఎల్పీజీ, ఓడిఎఫ్ ప్లస్,రెవెన్యూ రికార్డ్స్ డిజిటలైజేషన్ చేశారు,సోలార్ప్రాజెక్ట్,సోక్ పిట్స్తదితర పథకాలను గురించి అధికారులను ఆరా తీశారు.. ప్రధానమంత్రి ఎల్పీజీ పథకం సక్రమంగాఅమలు అవుతోందని కలెక్టర్ వివరించారు.. ఎవ్వరూ కూడా కిరోసిన్ వినియోగించడం లేదని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణంలో కూడా ముందంజలో ఉన్నామనితెలిపారు. అదే విధంగా హౌసింగ్ పథకం అమలు లో భాగంగా వర్షపు నీటి నిల్వ కోసం సోక్ పిట్స్ నిర్మించడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. వెబ్ ల్యాండ్ ద్వారా రైతు పేరు, ఖాతా నెంబరు, క్లాసిఫికేషన్ లను "మీ-భూమి" యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు అని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వివరించారు. ఆర్ డబ్ల్యూఎస్ కు సంబంధించి హర్ ఘర్ కాజల్ ద్వారా 65 శాతం కొళాయి కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని సంబంధిత అధికారితెలిపారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి నిధుల వినియోగం, అమృత్ గ్రాంట్ క్రింద మంజూరైననిధులు, అమలు చేస్తున్న పథకాల గురించి మున్సిపల్ కమీషనర్ వివరించారు. ఇరిగేషన్ కు సంబంధించి మైనర్, మీడియం, మేజర్ ట్యాంకుల గురించి ఇరిగేషన్ ఎస్ఈ వివరించారు..ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పంచాయతీ రాజ్ శాఖ ఈ ఈ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమీషనర్ భార్గవ తేజ, టెక్నికల్ ఆఫీసర్ (సైంటిస్ట్-సి) బిజయ్ కేతన్ మొహంత, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సిఈఓ నాసర రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, భూగర్భ జల అధికారి శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, డిపిఓ నాగరాజునాయుడు, డిఆర్డిఎ పిడి సలీం బాషా, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

# లిక్కరు కిక్కులో నిక్కరు బాబులు


ఆదోని పట్టణంలోని ఓ వైన్ షాపులో చిన్న మందుబాబులు

గతంలో ఎప్పుడూలేనంతగాయువతమద్యంమత్తులో ఊగిపోతోంది. ఒకవైపు కుటుంబ ఆర్థిక సమస్యలు, మరోవైపు నిరుద్యోగం వంటి కారణాలతో యువత పెడదారి పడుతోంది. చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాల్సిన విద్యార్థులలో ప్రారంభంలో కొంతమంది సరదాగా మద్యం తీసుకొంటారు. లేదంటే ఎవరైనా వీరికి బలవంతంగా అలవాటు చేస్తారు. ఆ తర్వాత ఇది చెడు వ్యసనమై దానికి బానిసలుగా మారి దారి తప్పుతున్నారు. కొందరు పిల్లలైతే మద్యం మత్తులో పట్టణ వీధుల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఫిర్యాదులు పోలీసులకు స్థానిక ప్రజల నుంచి అందుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇదిలా ఉంటే..కర్నూలు జిల్లాలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కొన్ని మద్యం షాపులలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నాయని బాహాటంగా వినిపిస్తున్న మాట. 21 సంవత్సరంలోపు వున్నవారికి మద్యం విక్రయించకూడదు అన్న ప్రభుత్వ నిబంధనలను మద్యం షాపుల నిర్వాహకులు తుంగలోకి తొక్కుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితేనేం ఆదోని, ఎమ్మిగనూరు, పెద్దకడబూరులాంటి ప్రాంతాలలో ఉన్న మద్యంషాపులలో మాత్రం అవేవీ పట్టించుకోకుండా.. సాధారణ మందుబాబులతో పాటు కూలీ పనులకు, కాలేజీకి వెళ్లే 18 ఏళ్లలోపు ఉన్న వయస్కులకు కూడా మద్యాన్ని మంచి నీళ్లలా అమ్మడంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ మద్యం ఆరోగ్యానికి ఎంత హానికరమో తెలియని 'చిన్న' మందు బాబులు దాన్ని గటగటా ముక్కు, కళ్లు మూసుకుని లాగేస్తున్నారు. వృద్ధులు, మధ్య వయస్కులు, యువకులైతే ఫర్వాలేదు. కానీ 18, 19 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారికి సైతం మద్యాన్ని విక్రయించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపైనా జనం మండిపడుతున్నారు. మైనర్లు అని కూడా చూడకుండా తమ ఇష్టానుసారంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్న మద్యం షాపులపై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోకపోతే వారి పిల్లల భవిష్యత్తు చేయిదాటే ప్రమాదం లేకపోలేదని సామాజిక నిపుణులు గుర్తు చేస్తున్నారు. అంతేకాదు ఆ వయస్సు పిల్లలు మద్యం తాగడం వల్ల అది వారి నేరాలకు పాల్పడేలా చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. పైగా మద్యం అనేది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనేక నేరాలకు సంబంధించింది. మద్యం, బాల్య యవ్వనం కలసిపోతే వారికి తెలియకుండా సామాజిక వ్యతిరేక కార్యకలాపాలకు తద్వారా రాబోయే కాలంలో హింసాత్మక చర్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని సామాజిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సమస్యలపై గళం విప్పేరా?

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11.00గంటలకు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. సమావేశంలో ప్రధానంగా నాలుగు అంశాలను అజెండా నిర్వహించనున్నారు. అందులో వ్యవసాయం,గ్రామీణ నీటిపారుదల, పారిశుధ్యం,నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖపై ప్రధానంగా చర్చించనున్నారు. సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండి.ఫరూక్, కో-ఆప్షన్ సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆయా శాఖల జిల్లా అధికారులు హాజరుకానున్నారు. **సమస్యలపై గళం విప్పేరా?:** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా నిర్వహించనున్న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంపై ప్రాధాన్యత సంతరించుకుంది. అజెండా అంశాలపై జిల్లా పరిషత్ పరిధిలో జడ్పీ చైర్మన్ వైసీపీ వర్గం కావడం, మంత్రులు టీడీపీ వర్గం కావడంతో ఈ సమావేశంపై ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై గళం విప్పి మాట్లాడతారా లేక అజెండా అంశాలపై చర్చించి సభను ముగిస్తారా అన్నదిసర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలోప్రధానంగా వ్యవసాయం, పారిశుధ్యం, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తి అధికారులను నిలదీస్తారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ మధ్యకాలంలో తాగునీటి కలుషితం మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార ప్రబలి బాలిక మృతిచెందడం, పలువురు ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం మొత్తం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈసారి వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో లక్ష్యం మేరకు సాగు కాలేదని వ్యవసాయాధికారులే చెబుతున్నారు. రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి ఆదుకోవాలని ఆ దిశగా సర్వ సమావేశంలో చర్చిస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో తాగునీరు ప్రధాన సమస్యగా ఉంది. గత కొంతకాలంగా తాగునీటి కోసం బోరు, బావులపై ఆధారపడాల్సి వస్తుంది. దీనిపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

# జురాలకు మొదలైన వరద

(మొదటి పేజి తరువాయి)

3.956 టీఎంసీలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 71,682 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 293 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠ నీటినిల్వ 105.788 టీఎంసీలకుగాను ప్రస్తుతం 41 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

# మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

(మొదటి పేజి తరువాయి)

కాలనీలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాల్, 15వ వార్డు బుధవారపేట స్మశానవాటికలో రూ.70 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం దాదాపు రూ.2.00 కోట్ల నిధులకు సంబంధించి మంత్రి, ఎంపీ తొలిసారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరమంతా మౌలిక సదుపాయాల కల్పన పక్క ప్రణాళికలతో ముందు కెళ్తామన్నారు. కమిషన్లు తీసుకునే అలవాటు, పనుల నాణ్యతలో రాజీ పడే అలవాటు తమకు లేదన్నారు. కాంట్రాక్టుర్లు నాణ్యతతో అభివృద్ధి పనులు చేస్తే చాలు తమకు అదే సంతోషమన్నారు. నాణ్యత లోపిస్తే తదుపరి పరిణామాల తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రజా సమస్యలను దశల వారీగా పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ మాట్లాడుతూ నగరంలో నగరాభివృద్ధికి కృషి చేస్తానని, గతంలో అభివృద్ధి శూన్యమన్నారు. మంత్రితో కలిసి నగరాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, నగరాన్ని అన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు కైప పద్మాలత, పల్లవి, శివమ్మ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈలు షాకీర్, శేషసాయి, ఏఈ జానార్ధన్, భాను తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లు కట్టాలంటే క్యూలో నిలబడాల్సిందే


సెల్‌ఫోన్‌లో బిల్లులు కడుతున్న ప్రజలు

**కర్నూలుసిటీ,మేజర్‌న్యూస్:** ప్రజలు విద్యుత్ బిల్లులను చెల్లించడానికి గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ పనిచేయకపోవడంతో ప్రజలు పనులు మానుకొని క్యూలైన్‌లలో వేచి ఉండాల్సి వస్తుంది. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యూపీఐల ద్వారా ప్రజలు క్షణాల్లో విద్యుత్ బిల్లులను చెల్లించేవారు. అయితే ప్రభుత్వం ఈ యూపీఐల నుంచి విద్యుత్ బిల్లులను చెల్లించడం రద్దు చేసింది. దీంతో ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారులు అయితే ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ నుంచి కట్టాలని యాప్‌ను విడుదల చేసింది. అయితే ఈ యాప్ సరిగా పనిచేయడం లేదు. పట్టణాల్లో చాలా వరకు ప్రజలు అద్దె ఇళ్లలో బాడుగకు ఉంటున్నారు. యాప్‌ను ఓపెన్ చేసి సర్వీస్ నెంబర్ ఎంటర్ చేసి ఫోన్‌నెంబర్ ఎంటర్ చేస్తుంటే మీ నెంబర్ ఇది కాదని చూపిస్తుండటంతో చాలామంది ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీంతో ప్రజలు విద్యుత్ బిల్లుల కేంద్రాల వద్దకు వెళ్లి బిల్లులు కట్టాల్సి వస్తుంది. అయితే కేంద్రాల వద్ద క్యూలైన్ దాదాపు అరకిలోమీటర్ దాకా ఉంటోంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బిల్లుల వసూలు కేంద్రాల వద్ద యూపీఏ సర్వీసులు పనిచేయడం లేదు. కేవలం నగదును మాత్రమే తీసుకుంటున్నారు. నగదును మాత్రమే ఇవ్వాలని అధికారులు ఎలాంటి బోర్డును ఏర్పాటు చేయలేదు. దీంతో వినియోగదారులు గంటల తరబడి క్యూ లైన్‌లో నిల్చొని కౌంటర్ వద్దకు వెళితే.. కేవలం నగదు మాత్రమేనని చెబుతుండటంతో ప్రజలు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు మానుకొని బిల్లులు చెల్లించడానికి వస్తుంటే అధికారులు కేవలం నగదు మాత్రమేనని చెప్పడం బాధకరమని వారు విమర్శిస్తున్నారు. యాప్ పనిచేయకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. విద్యుత్ అధికారులు బిల్లులను చెల్లించేందుకు ప్రత్యామ్నయం చూపాలని వినియోగదారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి బిసిని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల జిల్లా ఎస్పీ

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

బనగానపల్లె శాసన సభ్యులు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖా మాత్యుడు బి.సి జనార్ధన్ రెడ్డిని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాసింగ్ రాణా గురువారం నాడు బనగానపల్లె పట్టణంలోని బి.సి స్వగృహం నందు వారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంపై బనగానపల్లె మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి, రామ్‌నాథ్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.


మంత్రి బీసికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ

# వైసీపీ పాలనలో చేసిన అక్రమాలను బయట పెడతాం

**- మంత్రాలయం టీడీపీ ఇంఛార్జీ**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అక్రమాలు, దోపిడిలను బయట పెట్టి ప్రజలకు తెలియజేస్తామని టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాధవరం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జి.ఓ 512రద్దు చేయడం జరిగిందన్నారు. భూ పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందా పేరుతో 9.750 కోట్లతో దోచుకున్నారన్నారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైసీపీ నేతలే నిర్ణయించారు. ముందే స్థలం కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయించారన్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్మిన ఘనత వైసీపీ నాయకులకు దక్కిందన్నారు. ఈ భూబాగోతాన్ని సాక్షాధారాలతో బయట పెడతామన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో భూదందాలు, సహజవనరుల దోపిడీపై

# శ్వేతపత్రం విడుదల



మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేశారని ఆలూరు టీడీపీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఏంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాల ద్వారా టీడీపీ ప్రభత్వం బయట పెడుతుందని వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయి. వాటి విలువ రూ.35,576 కోట్లు పైగా ఉంటుందని పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750 కోట్ల దోచుకున్నారు.వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ గా నియమించి పేద ప్రజల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారనిహౌసింగ్ కాలనీ ఎక్కడ కట్టాలో నిర్ణయించి తక్కువ ధరకు రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి ఇళ్ల స్థలాల కోసం అమ్మిన ఘనత వైసిపి పార్టీదని అన్నారు.అందులో భాగంగా విశాఖలో రామానాయుడు స్టూడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి,రేణుగుంట లోని మఠం భూములను, పుంగనూరులో 982 ఎకరాలను కూడా కొట్టేశారు.దస్పల్లా భూములను కొట్టేసి ఇళ్లు కట్టారు.చిత్తూరులో 782 ఎకరాలు అధికారులను బెదిరించి భూములకు పట్టాలు తెచ్చుకొని వాటిలోభవనాలు కట్టుకున్నారు.ఇలా చెప్పుతూ పోతే వైసిపి బాగోతం పేజీలు తక్కువ వస్తాయని అన్నారు.కావున ప్రజలు వారికి బుద్ధి చెప్పారని అన్నారు.సమావేశంలో టీడీపీ నాయకులు రాంనాథ్ యాదవ్,సురేంద్ర,సాలిసాబ్, తిమ్మారెడ్డి, బిజెపి నాయకులు బసవరాజు,రమేష్ లు పాల్గొన్నారు.




## అడవి దుప్పికి గాయాలు – వైద్యం అందించిన అధికారులు



అడవి దుప్పికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు పడిన అడవి దుప్పికి గాయాలు కావడంతో అధికారులు వైద్య పరీక్షలు అందించారు. గురువారం తెలుగుగంగ కాలువలో అడవి దుప్పి గాయాలతో పడి ఉన్న దృశ్యాన్ని చూసి ప్రజలు సమాచారం అందించడంతో అటవీ శాఖ సిబ్బంది డిఆర్ఓ హైమావతి తన సిబ్బందితో చేరుకుని వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. తిమ్మాపురం పశు వైద్యాధికారి డా.కరుణాకర్ వైద్య పరీక్షలు అందించి కోలుకునేంత వరకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దీంతో అటవీ అధికారులు పర్యావరణ కేంద్రంలో ఉంచి పై అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

## పలుచోట్ల ఆకస్మీక తనిఖీలు చేపట్టిన అవుకు ఎంపిడిఒ



మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎం.ఈ.వొ, ఎంపిడివొ

**అవుకు, మేజర్‌న్యూస్:** అవుకు ఎంపిడివొ ఎ. మల్ రెడ్డి గురువారం అవుకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎం.ఈ.వొ శ్రీధర్‌రావుతో కలిసి అకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను ఆ కార్యక్రమం గురించి ఆరా తీశారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు , సలహాలు ఇచ్చారు. తర్వాత మెట్టుపల్లె అంగన్‌వాడి సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సెంటర్ పనితీరును చూసి నిర్వాహకులతో మాట్లాడారు. అవుకు రెండవ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో పలు విషయాలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని విధులలో ఏమాత్రం అలసత్వం వహించినా కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా చేపట్టాలని వారిని సూచించారు.

# గిరిజన గర్భవతులకు ప్రత్యేక చికిత్సలు

– క్షయ, కుష్టువ్యాధిపై అవగాహన కార్యర్యక్రమం



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్ కుమర్, గోపాల్‌లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బైర్లూటి పరిధిలోని గర్భవతులకు ప్రత్యేక చికిత్సలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ పవన్‌కుమార్, గోపాల్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని బైర్లూటి, నాగలూటి, ఎస్ఎన్ తాండా గ్రామాల గిరిజన గర్భవతులకు చికిత్సలు, వెంకటాపురం గ్రామంలో కుష్టు, క్షయవ్యాధిపై అవగాహన కల్పించి సర్వే చేపట్టడం జరిగిందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి నెల వైద్యులను సంప్రదించి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి ఐరన్, సూక్రోజ్ ఎక్కించడం జరిగిందన్నారు. తప్పనిసరిగా ప్రసవాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయించుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. దోమల భారి నుంచి కాపాడుకునేందుకు దోమతెరలు వాడాలని అన్నారు. నేటి నుంచి క్షయవ్యాధి, కుష్టు వ్యాధి, బిసిజి టీకా ప్రాధాన్యతను టిబి సూపర్‌వైజర్ మస్తానయ్య వివంరించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు కనిపిసేత తప్పనిసరిగా వైద్యాధికారిని సంప్రదించాలన్నారు.వర్షాకాలం ప్రారంభమైందని దోమలు వ్యాప్తి చెంది సీజనల్‌గా వచ్చే వ్యాధులు డయేరియా, మలేరియా, డెంగ్యూ, అతిసారా లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఖుద్దూస్, స్టాఫ్‌నర్స్ షఫిమున్నిసా, ల్యాబ్ టెక్నిషియన్ సోమేశ్వరి, సిహెచ్ఓ దీపికా బాయి, యశోద,ఆరోగ్య కార్యకర్తలు బేబి జ్యోతి, పద్మావతి, శారద, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన ఆదిమూలపు సతీష్



నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** సి.బెళగల్ మండలం పలుకుదొడ్డి గ్రామానికి చెందిన సర్పంచ్ లక్ష్మిదేవమ్మ గురువారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ లక్ష్మిదేవమ్మ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సోమశేఖర్‌రెడ్డి, ఈర్లదిన్నె నాగేశ్వర్‌రెడ్డి, కొండాపురం శంకర్‌రెడ్డి, గుండ్రేవుల శ్రీనివాసరెడ్డి, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్ దస్తగిరి, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, సంగాల సర్పంచ్ మనుమంతు నాయకులు పాల్గొన్నారు.

## పిల్లల శిక్షణ కేంద్రం తనిఖీ

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర ట్రైనింగ్ అండ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కల్పనశైల సందర్శించారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ ఎలా చేస్తున్నారని పరిశీలించారు. టీఎఆర్ఎల్ కార్యక్రమం అమలు, రిపోర్టులను, విద్యార్థుల స్థాయిని పరీక్షించారు. మండల విద్యాశాధికారి ఎం.శ్రీనివాసులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్ సురేష్‌రాజు, టీఎఆర్ఎల్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ అబ్దుల్, ఐఈఆర్‌పీలు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో

## బేటీ పడావో బేటీ బచావో

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని నారపరెడ్డి కుంట, నెమళ్ళకుంట,నాయనిచెరువు గూడెం అంగన్‌వాడి సెంటర్లలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆత్మకూరు ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల వివాహ వయస్సు 18 ఏండ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వరల్డ్ విజన్ ప్రాజెక్టు అధికారి తిరుపతిరావు మాట్లాడుతూ చెంచుగూడెంలోని ప్రజలకు ఆరోగ్య భద్రత, విద్య,జీవనోపాధి స్థితి గతుల గురించి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దినేష్, సూపర్‌వైజర్ రమాదేవి, విలేజ్ హెల్త్ క్లీనిక్ సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి



వీఆర్వో కార్యదర్శికి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వేతన సంఘం నాయకులు

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం మండల నాయకుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా కౌలు కార్డులను జారీ చేయాలని, పెట్టుబడి సాయం క్రింద 20,000ల రూపాయలను ఖరీఫ్ సీజన్‌లోనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటలకు భీమా వర్తింపజేసి రైతులకు విడివిడిగా రుణాలు అందజేయాలని వారు తెలిపారు. అనంతరం పార్నపల్లె గ్రామ సచివాలయం నందు వీఆర్వో తిరుపాల్ పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు హుశేన్ వలి, మనోహర్, నాగపుల్లయ్య, ప్రజా సంఘాల నాయకులు, రత్నమయ్య రాజు పాల్గొన్నారు.

# బ్యాంకుల నుండి వచ్చే రుణాలను వినియోగించుకోండి

రాష్ట్ర గొర్రెలు, మేకల ఫెడరేషన్ ఛైర్మెన్ వై.నాగేశ్వరరావుయాదవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావుయాదవ్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** గొర్రెలు, మేకల పెంపకందారులకు బ్యాంక్‌లు ఇచ్చే రుణాలను వినియోగించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, గొర్రెలు, మేకల ఫెడరేషన్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో గొర్రెలు, మేకల పెంపకందారులు పారిశ్రామికవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వై.నాగేశ్వరరావుయాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపకందారులకు బ్యాంకుల నుండి పొందగలిగే రుణాలు 1.ఎన్ఎల్ఎం పథకం, 2.షీప్ ఎంటర్‌ప్రాసెస్, 3.ఎన్‌సిడిసి రెండవ విడత, 4. మీట్ డిమాండ్ మొదలగు విషయాల గురించి వివరించారు. అనంతరం పెంపకందారుల సమస్యలను తెలుసుకొని, వారు ఏ విధమైన బ్యాంక్ రుణాలను పొందగలరు, గొర్రెలకు, మేకలకు ఏవిధమైన పోషకాహారాలు అందించాలి, వాటిని వృద్ధిని ఎలా పెంచుకోవాలి అనే వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ జాహ్నవీ, డాక్టర్ సుబ్బారెడ్డి, హుస్సేనాపురం గ్రామ పెద్దలు, రైతులు, ప్రజాప్రతినిధులు, పెంపకందారులు పాల్గొన్నారు.

## తొలిరోజు ఒక నామినేషన్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర పాలక స్థాయి సంఘం కమిటీ సభ్యుల ఎన్నికల నగరా మోగిన విషయం తెలిసిందే. తొలిరోజు గురువారం ఒక నామినేషన్ దాఖలైంది. 40వవార్డు కార్పొరేటర్ ఎం.విక్రమసింహారెడ్డి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు.

సూర్య



# రికార్డుల నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి

- బండిఆత్మకూరులో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన
- పారిశుద్ధ్య పనుల నిర్లక్ష్యంపై సిబ్బందికి చివాట్లు
- కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణ్యా తెలిపారు. గురువారం బండిఆత్మకూరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. వైద్యులు తమ సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించిన అనంతరం రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా చూడాలని సీజనల్ వ్యాధుల పట్ల దృష్టి సారించి గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్, ప్రసూతి వార్డు, మందులను పరిశీలించారు. అక్కడే వైద్య సేవలు పొందుతున్న రోగుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో పర్యటించారు. విద్యార్థులతో నేరుగా వెళ్ళి సమస్యలు


ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ గతంలో కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సిబ్బందికి సూచించారు. భోజన వసతి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రంలో రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులనిర్వహణ సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు పౌష్టిక ఆహారం అందజేస్తూ మంచి వసతులను కల్పించాలని సూచించారు.

**- పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందికి చివాట్లు**

మండల కేంద్రం అయిన బండిఆత్మకూరులో


కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పర్యటించిన జిల్లాకలెక్టర్ రాజకుమారి గణ్యా పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి చివాట్లు పెట్టారు. దారి పొడవున డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తా, చెదారం అలాగే ఉందని రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలు నడిచే దారుల వెంట డ్రైనేజీ సమస్యలలు ఉండడంతో రేపటిలోగా పారిశుధ్య పనులు పూర్తి చేయాలని సిబ్బందికి తాఖీదు ఇచ్చారు. కలెక్టర్ ఆగ్రహంతో జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి మండల కేంద్రంలో పర్యటించి పారిశుధ్య పనులను చేపట్టారు.

## ఫేక్ కమిటీలను నివారించండి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఫేక్ కమిటీలను నివారించాలని మండల పరిధిలోని నన్నూరు గ్రామ అంజుమాన్ కమిటీ ప్రెసిడెంట్ మీర్జా సలీం బేగ్, సెక్రటరీ ఫిరోజ్ ఖాన్ ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు నన్నూరు గ్రామంలో ముస్లింల సమస్యల కోసం జామియా మజీద్ అంజుమాన్ కమిటీని ఏర్పాటు చేయడమైనది మైనార్టీలకు సంబంధించిన ఏ విషయమైనా అంజుమాన్ కమిటీ ద్వారానే ప్రతిపాదించబడేదని కానీ కొంతమంది తమ స్వలాభం స్వార్థాల కోసం ఇతర కమిటీలను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని వేరే కమిటీలు ఏర్పాటు చేసి పనులు చేస్తున్నామంటూ వచ్చే వాళ్లను ప్రభుత్వం తరపున ఎలాంటి నిధులు మంజూరు చేయొద్దని ఏ పనైనా ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న అంజుమాన్ కమిటీ ద్వారానే జరిగే టట్లు చూడాలని ప్రభుత్వాన్ని మైనార్టీ మంత్రిని కోరారు.

## కౌలు కార్డులతో రైతు సంక్షేమ పథకాలు



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని విఆర్ఓ మహబూబ్ బాషా అన్నారు. గురువారం మండల పరిధిలోని మీదీవెముల గ్రామంలో రైతు సేవ కేంద్రాల్లో రైతుల నుంచి కౌలు కార్డుల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని కౌలు రైతులందరూ ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామాంజనేయులు బుగ్గ రాముడు రాజు మధు బెల్లం గోవిందు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాణ్యం ఎమ్మెల్యేను కలిసి ఆర్‌యూ ఇన్‌ఛార్జ్ వీసీ


ఎమ్మెల్యేకు పూలబొకే అందజేస్తున్న ఆర్‌యూ ఇన్‌చార్జి వీసీ

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్ ఎన్‌టికె.నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

## పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత

**కల్లూరు, మేజర్‌న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పెషలాఫీసర్ రమణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటల సాగు కోసం పంట పొలాలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోఆర్డీ రవికిషోర్, ఏపీవో మద్దేశ్వరమ్మ పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

# కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ, ఎన్ఎండి ఫిరోజ్


కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను సమర్పిస్తున్న ఎస్పీ


కలెక్టర్ రాజకుమారికి పూలబొకెను అందజేస్తున్న ఎన్ఎండి ఫిరోజ్


ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు మహానందీశ్వరుని ఫోటోను బహుకరిస్తున్న ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల నూతన ఎస్పీగా బాధ్యతగా చేపట్టిన అధిరాజ్ సింగ్ రాణా గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈసందర్భంగా శాంతిభద్రతలపై ఇరువురు చర్చించారు. అలాగే జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకెను అందజేశారు. అలాగే ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను మర్యాదపూర్వకంగా కలిసి షాలువాకప్పి బొకెను అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజలు ప్రశాంతంగా జీవించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## మున్సిపల్ కమీషనర్ డాక్టర్ యస్.జయరామ్

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు వారి పరిసరాలతో పాటుగా ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డోన్ మున్సిపాలిటీ కమీషనర్ డాక్టర్ యస్.జయరామ్ ప్రజలకు సూచనలు జారీ చేశారు. గురువారం పట్టణంలోని 20వ వార్డు నందు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాలలో పెరిగిన మొక్కలను, కంపచెట్లను గుర్తించడం జరిగిందని, దీనికి సంబందించి స్థల యాజమానులకు నోటీసులు ఇచ్చి, వారి స్థలాలను శుభ్రంగా చేసుకోమన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి దానికి అయ్యే ఖర్చు మొత్తం స్థల యజమానులే భరించాల్సి ఉంటుందన్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్‌లను గుర్తించి వారి యజమాన్యాలకు నోటీసులు ఇచ్చి వాటిని డిమాలిష్ చేయమని అధికారులకు ఆదేశించారు. ఇంటింటి నుండి సేకరించే తడి, పొడి చెత్తను వేరు చేయడంలో అలసత్వం వహించినందుకు శానిటేషన్ సెక్రటరీ పైన కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కమీషనర్ జయరామ్

# జిలాల్లో సీజనల్ వ్యాధులను పూర్తిస్థాయిలో అరికట్టాలి

- అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** జిల్లాలో డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తిస్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. గురువారం సీజనల్ వ్యాధుల అరికట్టడంపై తీసుకోవాల్సిన చర్యల గురించి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, స్పెషలాఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఈవోఆర్డీలు, మెడికల్‌ఆఫీసర్లలతో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం అయినందున గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండా పూర్తిస్థాయిలో అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్యం, నీటి కలుషితం వల్ల అంటువ్యాధులు వ్యాప్తిచెందకూడదని, ఒక్క మరణం కూడా సంభవించకూడదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. డయేరికాకు సంబంధించి స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించినప్పటికీ కూడా ఒకటి లేదా రెండు గ్రామాల్లో డయేరియా వల్ల బాధపడుతున్నారని, ఇకపై ఇలాంటి పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. తాగునీటికి సంబంధించి ఎన్ని గ్రామాలకు వాటర్‌సోర్సు ద్వారా, ఎన్ని గ్రామాలకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా నీటిని అందిస్తున్నారు అన్న వాటిని పరిశీలించారు. ఉపాధి హామీ పనులు ఎక్కువగా కల్పించాల్సిన అవసరం ఉన్న కర్నూలు జిల్లా 25వస్థానంలో ఉండటం ఏంటని కలెక్టర్ ఎంపీడీవోలను ప్రశ్నించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో చెత్తను తొలగించడానికి సిబ్బందిని పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భార్గవతేజకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాష

సూర్య
శుక్రవారం | 19 జులై 2024

## ఆళ్లగడ్డ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించండి..ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు,వీధిలైట్లు, పారిశుధ్యం తదితర వసతుల కల్పనకు ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని వాళ్లకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను ఆదేశించారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం కౌన్సిల్‌హాల్‌లో చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ వార్డులలో నెలకొన్న సమస్యలను తరచుగా జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొని కౌన్సిల్ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. పట్టణంలోని అన్ని వార్డులలో ఎన్నో సమస్యలు ఉన్నాయని గత ప్రభుత్వం వీటిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత తెలుగుదేశం పార్టీ హయాంలో మాత్రం ఆ పరిస్థితి ఉండదని అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను తెలుసుకుంటామని అధికారులను కూడా మమేకం చేస్తామన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తున్నదని కౌన్సిలర్ వెంకటసుబ్బమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు . మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ బాషా మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డులలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటన్నిటిని కౌన్సిలర్లు వివరించాలని కోరారు. నాయి బ్రాహ్మణ కాలనీలో సరైన రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ లేదని చాలా వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొందని వివరించారు.అలాగే మున్సిపల్ దుకాణాల అద్దెలను 33 శాతం పెంచుతున్నట్లు తెలియవచ్చిందని ప్రభుత్వం నూతనంగా ఇప్పుడే ఏర్పడింది కాబట్టి అద్దె పెంపు విషయం పునరాలోచించాలని కౌన్సిలర్ హుస్సేన్ భాష కమిషనర్ రమేష్ బాబును కోరారు.మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ఉర్దూ స్కూల్ సమస్యను ఎమ్మెల్యే అఖిలప్రియ దృష్టికి తీసుకుని వచ్చారు. పట్టణంలో కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లు తరచుగా జరిగే సమావేశాలకు గైర్హాజరయితే మూడు పర్యాయలు చూస్తామని తర్వాత వారి కౌన్సిలర్ పదవిని తొలగిస్తామని హెచ్చరించారు. ప్రజల చేత ఎన్నుకోబడి కనీసం మీటింగ్లకు కూడా రాకపోతే చెడ్డ పేరు వస్తుందన్నారు. పట్టణంలో నెలకొన్న డ్రైనేజీలు రోడ్లు వీధిలైట్లు తదితర అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పారిశుధ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సాలరీ అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఈ సమావేశంలో మండల తాసిల్దార్ నజీర్ అహ్మద్, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అన్ని వార్డుల కౌన్సిలర్లు, సిఐ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ నాయకులతో మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె శాసన సభ్యుడు రోడ్లు భవనాల మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో గత కొంత కాలంగా ఆయన బిజీగా ఉన్నారు. దీంతో గ్రామ స్థాయి నాయకులతో మాట్లాడటం కోసం ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించుకొని గురువారంనాడు గెస్ట్ హౌస్ నందు నాయకులతో ముఖాముఖి చర్చించారు. ఎన్.డి.ఎ నాయకులు, కార్యకర్తలు సదరు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు మా గ్రామ సమస్యలను మంత్రికి వివరించారు. మరికొన్ని గ్రామాల వారు గ్రామ సమస్యలపై అర్జీలను అందించారు. త్వరలోనే అన్ని వినతీపత్రాలు పరిశీలించి ప్రతి ఒక సమస్యను తీరుస్తానని హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్థాయి నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బి.సి

## ముత్యాలపాడులో ఘనంగా మొహర్రం వేడుకలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మొహర్రం వేడుకల సంధర్భంగా కొలువుదీరిన ప్రధాన పీరు లాలు స్వామిని గురువారం సాంప్రదాయ బద్ధంగా ఊరేగింపు చేశారు. లాలు స్వామిని పురవీధుల గుండా భారీ జనసందోహం మధ్య హిందూ ముస్లిం సోదరులు పరస్పరంగా ఒకరికి ఒకరు గంధం చల్లుకుంటూ డప్పు, మేళాలతో ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి లాలుస్వామి ఊరేగింపును తిలకించారు. అనంతరం మకానం వద్ద పిల్లలు, పెద్దలు, మహిళలు ఫాతేహాలు చేశారు. ఊరేగింపు అనంతరం పీర్లను శుద్ధి చేసి పెట్టెలో భద్రపరిచారు. ఎస్సై రమణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లాలుస్వామి మకానం కమిటీదారులు సయ్యద్ భై గారి రసూల్, టీచర్ మహబూబ్ బాషా, మాబుస్వామి, సయ్యద్ షరీఫ్, రసూల్ బాషా బ్రదర్స్ గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పాతె హాలు నిర్వహించారు.

## గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో సరస్వతి తనిఖీ



అంగన్వాడి కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

**పాములపాడు ,మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని జూటూరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో సరస్వతి తనిఖీ చేశారు సందర్భంగా సచివాలయంలోని అధికారులను పరిశీలించారు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు డయేరియా పై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టాలని సూచించారు అనంతరం అంగన్వాడి కేంద్రాల నీ తనకి ఇచ్చేసి రికార్డులు పరిశీలించారు అంగన్వాడి కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

## కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేత

**వెల్దుర్తి,మేజర్‌న్యూస్ః** కొందరు రైతులు సాగు చేసుకోవడానికి ఇతర రైతుల నుండి భూమిని కౌలుకు తీసుకొని పంటలను సాగు చేసుకుంటుంటారని, అలాంటి వారికి కూడా ప్రభుత్వం అందించే పథకాలు, సబ్సిడిలు పొందే విధంగాప్రభుత్వం వారికి కౌలుకార్డులను జారీ చేయడం జరిగిందని తహశిల్దార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయం నందు మండలంలోని గ్రామ విఆర్ఓలకు, విఆర్ఏలకు, కౌలుకార్డుల జారీ పై సమావేశం నిర్వహించి, అనంతరం కౌలు రైతులకు ప్రభుత్వం నుండి వచ్చిన కౌలుకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా తహశిల్దార్ మాట్లాడుతూ కౌలు కార్డులను మంజూరు చేయడం ద్వారా భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. కౌలుపై భూములను సాగుచేస్తున్న కౌలు రైతులకు తప్పనిసరిగా కౌలు కార్డులను జూలై నెల ఆఖరులోపు అందించాలని విఆర్ఓలకు తహశిల్దార్ ఆదేశించారు. కౌలు రైతులు కౌలు కార్డులను పొంది పంట నమోదు చేసుకోవడం, ఉచిత పంటల భీమా, సున్నా వడ్డీ, బ్యాంకుల్లో పంట రుణాలు, కనీస మద్దతు ధరపై పంట దిగుబడుల అమ్మకం వంటి పథకాలు లబ్ది పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి తహశిల్దార్, మండల వ్యవసాయ అధికారి, డిప్యూటి తహశిల్దార్, ఆర్ఐ, విఆర్ఓలు, విఆర్ఏలు పాల్గొన్నారు.



కౌలు కార్డును కౌలు రైతుకు అందిస్తున్న తహశిల్దార్, అధికారులు

## నగరంలో జనసేన పార్టీ సభ్యత్వం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:**కర్నూలు జిల్లాలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన వస్తుంది. కర్నూలు జనసేన ఇన్‌చార్జి అర్షద్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణదేవరాయల కూడలి వల్ల జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పవన్‌కళ్యాణ్ అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా అర్షద్ మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం తీసుకునేందకు యువత ముందుకు రావడం హర్షణీయమన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీ అన్ని విధాల అంగా ఉంటుందన్నారు. క్రియాశీలక సభ్యులకు భీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు.



## డామిట్ కథ అడ్డం తిరిగింది

- భూ వివాదాలపై 'రెవెన్యూ ఉలిక్కిపాటు'
- సంచలనం రేపుతున్న సూర్య కథనాలు
- కాలనాగు పక్షాన ఓ ఉన్నతాధికారి!
- ధరఖాస్తుదారుడు అనుభవంలో లేడని తేల్చిన సర్వేశాఖ
- సూర్య కథనంతో మున్సిపాలిటీ టూ పద్మావతినగర్
- రెవెన్యూ చట్టాలకు తూట్లు!

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల జిల్లా కేంద్రంలోని భూ బకాసురుడు రియల్ మాఫియాపై సూర్య కథనాలు రెవెన్యూశాఖ ఉలిక్కిపడింది. రియల్ ఎస్టేట్ ముసుగులో భూములపై కాలనాగు విషపు పంజాపై సూర్య అందిస్తున్న వార్తకథనాలు జిల్లా కేంద్రంలో సంచలనం రేపుతున్నాయి. రూ.కోట్ల విలువైన భూములను హస్తగతం చేసుకొనేందుకు కాలనాగు వ్యూహాలకు మరింత పదునుపెట్టారు. కాలనాగు పక్షాన జిల్లా ఉన్నతాధికారి ఒకరు ఉన్నరని రెవెన్యూలో వినిపిస్తున్న గుసగుసలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నంద్యాల మున్సిపాలిటీ వెనుక మూలసాగరం సర్వే నంబర్లు 428-6బి, 428-6ఎ, 428-5లో స్పందనలో సర్వే పై దరఖాస్తు చేసిన గాజుల మహమ్మద్ బాష అనుభవంలో లేరని సర్వే శాఖ తేల్చింది. ఆ మూడు సర్వే నంబర్ల మొత్తం విస్తీర్ణాన్ని కొలతలు వేసిన సర్వే శాఖ ప్రస్తుతం అనుభవంలో ఉన్న వారి జాబితాను సిద్ధం చేసింది. గురువారం సూర్య దినపత్రిక అందించిన తెరపై భూ వివాదాలు ...తెర వెనుక కాలనాగు అన్న వార్త కథనంపై రెవెన్యూ ఉన్నతాధికాలు దృష్టి సారించారు. ధరఖాస్తు దారుడు అనుభవంలో లేరని తే లిపోవడంతో గత త హసిల్దార్ జారీ చేసిన ఉత్తర్వులోని పద్మావతినగర్‌లోని మరోసర్వేనంబర్‌కుకథను మల్లించారు. అప్పటి తహసిల్దార్ పద్మావతినగర్ లో రెండు సర్వేనంబర్లలో ధరఖాస్తు దారుడు గాజుల మహమ్మద్ బాష ఏలాంటి క్రమవిక్రయాలు జరపకపోయి న మరొకరి పేరు మీద ఆన్‌లైన్ చేశారని పొందుపరుస్తూ ప్రస్తుత తహసిల్దార్ ఆర్‌డిఒ ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందచేశారు. గుమ్మడికాయ దొంగ ఎవరూ అంటే భుజాలు తడుముకున్నట్లుగా రెవెన్యూ యంత్రాంగంలోని కొందరు రూ.కోట్ల విలువైన భూములపై కుదిరిన భారీ ఢీల్‌ను సంజీవంగా ఉంటే ప్రయత్నాలు మొదలుపెట్టారు. రెవెన్యూ చట్టాలను రెవెన్యూఉన్నతాధికారులే తూట్లు పొడుస్తున్నారు. మున్సిపాలిటీ వెనుక భూమిపై కథ అడ్డం తిర గడంతో ధరఖాస్తు దారుడు అర్జీలో లేని పద్మావతినగర్ భూమిపై మల్లించి భూ వివాదం కథను మరింత రక్తికట్టిస్తున్న అంశంపై మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..



జిల్లా కేంద్రంలో భూ వివాదాలు రోజుకొక మలుపు తిరుగు తున్నాయి. సూర్య వరుస కథనాలు రెవెన్యూ శాఖను కుదిపేస్తున్నాయి. తెరపై భూ వివాదాలు...తెరవెనుక కాలనాగు అన్న శీర్షికన సూర్య దినపత్రిక అందించిన వార్త కథనంపై జిల్లా జాయింట్ రాహుల్ కుమార్‌రెడ్డి స్పందించిన ట్లు తెలుస్తుంది. నంద్యాల ఆర్‌డిఒ మల్లికార్జునరెడ్డి, నంద్యాల తహసిల్ధార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్ సహదేవుడుతో మాట్లాడినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. గత తహసిల్ధార్ జారీ చేసిన ఉత్తర్వులపై చర్చ జరిగినట్లు తెలుస్తుంది. సర్వే శాఖ మున్సిపాలిటీ వెనుక మంగళవారం కొలతలు వేసిన అంశంపై వివరాలు తెలుసుకున్నట్లు సమా చారం. గత తహసిల్ధార్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పొందుపరి చిన రిజిస్టర్ డాక్యుమెంట్లతో పాటు రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా నాణెనికి ఒకవైపు కనిపిస్తుంది. గురువారం సాయంత్రానికి కథ మలుపు తిరిగింది. మున్సిపాలిటీ వెనుక స్థలాన్ని కొలతలు వేయాలని స్పందనలో అర్జీ ఇచ్చిన ధరఖాస్తుదారుడు గాజుల మహమ్మద్ బాషకు ముడిపడిన పద్మావతినగర్ స్థలంపై నంద్యాల తహసిల్ధార్ నంద్యాల ఆర్డీఓ ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఒక నివేదికను పంపించారు. సూర్య వార్త కథనంలో సర్వేనంబర్లను పొందుపర్చకపోయి నా తహసిల్ధార్ తన నివేదికలో సూర్య వార్త కథనాన్ని ప్రస్తావించారు. మూలసాగరం సర్వే నంబర్లు 738-2, 738-3లో 18సెంట్లు, 10 సెంట్లు పై చేసిన మ్యూటేషన్‌ను రద్దు చేయాలని గాజుల మహమ్మద్ బాషా జాయింట్ కలెక్టర్‌కు ధర ఖాస్తు చేసుకున్నారని పేర్కొంటూ గాజుల మహమ్మద్ బాషా తన స్థలాన్ని ఎవరికి క్రయ విక్రయాలు జరపలేదని ధృవీకరిస్తూ భ వనాశి శ్రీనివాస్‌కు ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినా ఆయన పేరుతో మ్యూటేషన్ చేసినట్లు నివేదికలో పొందుపరిచారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లగా భవనాశి శ్రీనివాస్‌కు ఏలాంటి లింక్ డాక్యుమెంటేషన్ లేకుండా మ్యూటేషన్ జరిగినట్లు గుర్తించినట్లు నివేదికలో ప్రస్తావించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ జరుపుతూ నంద్యాల మండల, నంద్యాల సర్వేయర్లతో సర్వే చేయించి ఆ స్థలంలో ప్రస్తుత పరిస్థితిపై నివేదిక అందిన తరువాత చర్యలు తీసుకోవడం జరుగుతుందని నివేదించారు. తహసిల్ధార్ ఆర్ఓఆర్ ఉత్తర్వులపై డిఆర్ఓకు అప్పీలు చేసుకోవాలని రెవెన్యూ చట్టం చెబుతున్నా తిరిగి తహసిల్ధార్ సమగ్ర విచారణ ఒక వైపు సర్వేతో మరోవైపు రెవెన్యూ చట్టానికి రెవెన్యూ అధికారులే తూట్లు పొడుస్తుండటం కొసమెరుపు..

## జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించిన ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని తాలూకా జనసేన పార్టీ కార్యాలయం నందు జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తాలూకా జనసేన నాయకులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి గురువారం ప్రారంభించారు. ముందుగా ఆయన జనసేన సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం ఈనెల 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు కొనసాగుతుందని ఇందులో ఐదు లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ మరియు యాక్సిడెంట్ గురైతే 50 వేల రూపాయలు ఖర్చులకు ఇవ్వబడుతుందని ఈ సభ్యత్వం తీసుకోవడం వలన జనసేన పార్టీ యందు క్రియాశీలకంగా పనిచేయడం జరుగుతుందని కాబట్టి ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు .వివరాల కొరకు జనసేన పార్టీ కార్యాలయం నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ మహబూబ్ హుస్సేన్. బావికాడి గుర్రప్ప .దూదేకుల కోట్లబాబు .అబ్దుల్లా. దూలం మెగా చైతన్య .సజ్జల నాగేంద్ర. రంగస్వామి. ఎస్సీ సెల్ తాలూకా నాయకులు డాలు రత్నమయ్య. తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :**

నంద్యాల జిల్లా నూతన ఎస్పీగా వచ్చిన అది రాజ్ సింగ్ రాణా ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ గురువారం మర్యాదదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చమ్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆళ్లగడ్డ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.



ఎస్పీకి పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

## పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి


సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్చార్జి రేఖాగౌడ్

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి రేఖాగౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మండలంలోని ముఖ్య కార్యకర్తలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నాయకులే పార్టీకి బలమైన క్యాడర్ అని ఆమె గుర్తు చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీ తప్పక గుర్తించి సమ ఉచిత స్థానం కల్పిస్తుందని అన్నారు. ఈ నెల 28వ తేది వరకు కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి జనసేనలో చేర్పించాలాని కోరారు. సభ్యత్వం తీసుకున్నవారికి బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ నాయకులు గానుగబాషా, మండల నాయకులు మాలిక్, ఖాసీంసాహెబ్, స బాన్, మధు, మల్లికార్జున, రామాంజినేయులు, భాస్కర్, దూద్పీర, ఇస్మాయిల్, రంగస్వామి, నాగేష్ ఇబ్రహీం, షేక్షావలి, గబ్బర్, జీలాన్, మునాఫ్ పాల్గొన్నారు.

## సుంకేసుల గ్రామంలో ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు


ఎస్సై జగన్మోహన్

**మిడుతూర్ మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో గురువారం తెల్లవారుజామున పీర్ల పండుగ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు జరుగుతుండగా బాణసంచా కాల్చుతుంటే జరిగిన సంభాషణ తోఎస్సీలకుచెందిన మాలఅందే దేవరాజుమరియు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన భరత్ శర్మకు చిన్నపాటి ఘర్షణ మొదలై భరత్ దళితునీ పై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అగ్రవర్ణానికి చెందిన భరత్ శర్మ ఇంటికి పిలిపించుకొని దళితులపై దాడి చేసినట్లు దళిత యువకుడు మాల అందే దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భరత్ శర్మ మరియు అతని అనుచరులు కౌశిక్, ప్రభాకర్ రెడ్డి, వెంగన్న పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

## విద్యుత్ తీగలకు అంతరాయం లేకుండా చెట్లను తొలగింపు

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని మిట్ట కందల మజార గ్రామమైన బుద్ధ నగర్‌లో గురువారం విద్యుత్ తీగలకు అంతరాయం కలగకుండా జనసేన టిడిపి నాయకులు నాగేశ్వర రావు, వినోద్ కుమార్, బ్రహ్మయ్య, లు స్వచ్ఛందంగా విద్యుత్ లకు అడ్డంగా ఉన్న చెట్లను మరియు కొమ్మలను తొలగించారు గ్రామ అభివృద్ధి కోసం నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య, దృష్టికి గ్రామ సమస్యలు తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించుకుంటామని తెలిపారు స్వచ్ఛందంగా కంపచెట్లు తొలగించడం పై గ్రామస్తులు వర్షం వ్యక్తం చేశారు.



# మొక్కలతోనే మానవ జాతి మనుగడ

**మైనార్టీ కాలనీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బీవీ**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** మన చుట్టూ ఉన్న వృక్షాలు అభివృద్ధితోనే మానవజాతి మనుగడు సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మైనార్టీ కాలనీలో 10 వేలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనానికి చిరునామాగా ఎమ్మిగనూరు మార్చాలన్న ఆశయంతో కృషి చేస్తున్నామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో చేపట్టే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందన్నారు. మొక్కలు నాటితే భవిష్యత్తు తరాలకు పర్యావరణ ఫలాలను అందించే వారవుతారన్నారు. నాటే చెట్లను రక్షించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. అలాగే స్థానిక ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు.

**గత ప్రభుత్వం చేసిన దోపిడీని ప్రజలకు తెలిపేందుకే శ్వేత పత్రం విడుదల :** గత వైసీ ప్రభుత్వంలో జరిగిన దోపిడీ వాస్తవాలు రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నారని, ప్రతి శ్వేత పత్రంలో లక్షల్లో దోపిడి కనిపిస్తుందని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అన్నారు. సహజ వనరుల దోపిడీ జరిగిందన్నారు. మైనార్టీ కాలనీ అభివృద్ధికి గత టీడీపీ హయాంలోనే నిధులు కేటాయించామని వైసీపీ దాన్ని అసలు పట్టించుకోలేదన్నారు. త్వరలోనే ఈ కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జీడీపీ ద్వారా 24 గంటల పాటు తాగునీటి అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పట్టణంలో పేదల పట్టాల స్థలాల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. దీనిపై విచారణకు కూడా ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డి.ఈ మనోహర్ రెడ్డి, టీపీఓ గోపాల కృష్ణా, టీడీపీ నాయకులు జయన్న, తురేగల్ నజీర్ అహమ్మద్, కలీముల్లా, రంగస్వామి గౌడ్, కటారి రాజేంద్ర, సలీమ్, నరసింహ దామా, దాదా సాహెబ్, దేవేంద్ర, మినప్ప, జహంగీర్ బాషా, మల్లి, రంజాన్, నాగూర్ బాషా, ఈరన్న కౌన్సిలర్లు ఇషాక్, అమానుల్లా, చంద్రమోహన్ రెడ్డి, సూరి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బీవీ

# హులికన్విలో వైసీపీ, టిడిపి వర్గీయుల మధ్య ఘర్షణ

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పోలీసు స్టేషన్ పరిధిలోని హులికన్వి గ్రామంలో బుధవారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో వైసిపి టిడిపి వర్గీయులు మధ్య ఘర్షణలో ముగ్గురుకి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు గ్రామస్తులు భాదితులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హులికన్వి గ్రామంలో బుధవారం సాయంత్రం పీర్లదేవుళ్ళను ఊరేగింపుగా వెళ్లితున్న సమయంలో వైసిపికి చెందిన కొంతమంది వ్యక్తులు. తెలుగు దేశం పార్టీకి చెందిన మరికొంత మంది వ్యక్తులు కలసి ఆలయ బలాయి ఆడుతుండగా అందులోఒకరి నోకరు రాసుకోవడంతో వైసిపి టిడిపి పార్టీలకు చెందిన కార్యకర్తలు ఒక్కసారిగా కోపోద్రక్తులై ఇరువర్గాల వారు ఒకరినొకరిపై దాడులు చేసుకోవడంతో అందులో ఇరువర్గాలకు చెందిన వారు ముగ్గురికి రక్త గాయాలయ్యాయని గ్రామస్తులు బాధితులు తెలిపారు. గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయాన్ని కొందరు గ్రామస్తులు సమాచారం పెద్దకడుబూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పెద్దకడుబూరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరు గొట్టారు. దీంతో ఇరువర్గాలవారి పై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు.

# సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో తగ్గిన త్రాగునీరు..!

**వారానికి ఒకసారి త్రాగునీరు సరఫరా**

**బిందెనీటికి ధర రూ.10 నుంచి రూ.15లు చెల్లించాలి**

**పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్:** పెద్దకడుబూరు మండల కేంద్రంలో రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులలో ఘననీయంగా నీటిమట్టం తగ్గుముఖం పట్టాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. అంతే కాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని వారంలో ఒక రోజున గ్రామాలకు విడుదల చేయడం వల్ల తాగునీటి కోసం ప్రజలు అనేక ఇక్కట్లుకు గురవుతున్నామని వారు వాపోతున్నారు. ముఖ్యంగా పెద్దకడుబూరు మండల కేంద్రంలోరెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు చిన్నతుంభళం. బాపురం. ఓంనగర్ నాగలాపురం. గంగులపాడు గ్రామాలకు సక్రమంగా సరఫరా కాక పోవడంతో వారు మినరల్ వాటర్ నునీటి బిందెధర రూ10లు నుంచి రూ15 లు చెల్లించిఒక్కొక్కకుటుంభం రోజు ఐదారు బిందెలునీటిని కొనుగోలు చేసి తమ గొంతులన తడుపు కోవాల్సిన పరిస్థితి నెలకొందని అయాగ్రామాలప్రజలు అంటున్నారు. అలాగే తాగునీటి పైపులైన్ పగిలి పోయి నీరు వృథా అవుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే అనేక గ్రామాల్లో మంచినీటి బోర్లు. పిడబ్ల్యూఎస్ స్కీముబోర్లు చెడిపోయి మూలనపడుతున్న వాటి గురించి పట్టించుకున్న నాధుడే లేడు. అలాగే ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అవి కాస్తా కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం కింద కోట్లాది రూపాయలు వెచ్చించి మంచినీటి పైపులైన్లు ఓహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించారే కాని తమ గ్రామానికి చుక్క నీరు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రామీణా నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# కౌలు రైతులకు అవగాహన సదస్సు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖా సంయుక్తంగా కౌలు రైతుల అవగాహన సదస్సులను తాడిపత్రి, బోయల ఉప్పలూరు గ్రామాల్లో నిర్వహించడం జరిగింది. కొలిమిగుండ్ల మండలానికి 250 కౌలు కార్డులను మంజూరు చేసుకోవడానికి అవకాశం ఉందని అన్ని గ్రామాల రైతులు ఎవరైతే సాగు చేసుకుంటున్నారో వాళ్లంతా కౌలు కార్డులు విధిగా రైతు సేవ కేంద్రానికి వెళ్లి వి.ఆర్.వొ ద్వార పొందాలని అన్నారు. పొలం యజమానులు ఎలాంటి అభ్యంతరం లేకుండా కౌలు తీసుకున్న కౌలు రైతులకు కౌలు కార్డులు వచ్చే విధంగా సహకరించాలని అవగాహన కల్పించారు. ఈ కౌలు కార్డు 11 నెలలు కాల పరిమితి మాత్రమే కలిగి ఉంటుందని కౌలు కార్డు ఇవ్వడం వల్ల భూ యజమానికి వచ్చే అన్ని పథకాలకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. తదుపరి కౌలు కార్డుల వలన కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. కావున కౌలు తీసుకున్న ప్రతి రైతు విధిగా భూ యజమానిని సంప్రదించి కౌలు కార్డు పొందే విధంగా చేసుకోవాలని కోరుచున్నామని అన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో కౌలు కార్డులమీద అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఈ.వొ నాగరాజు, వి.హెచ్.ఎ స్నేహలత, వి.ఆర్.వొ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



సూర్య



# రాష్ట్రంలో ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తీసుకువస్తాం



మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

- కబ్జాదారులే యజమానులమని నిరూపించుకోవాలి
- రాష్ట్రంలో 1.75 లక్షల ఎకరాల భూమిని వైసిపి వారు కాజేశారు
- డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

**డోన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేళ్ళ కాలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు 1.75లక్షల ఎకరాల భూమిని కాజేశారని డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రతిక ప్రకటనలో మాట్లాడుతూ ఐదేళ్ళ మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విరుచుకుపడ్డారు. ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ వైసిపి నాయకులు గద్దల్లా వాలిపోయి కాజేసేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమ భూమిని కాపాడుకోవడానికి భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు. అనేక మంది నిరుపేద, మద్య తరగతి ప్రజలు భూ కబ్జాకారుల నుంచి తమ భూములను కాపాడుకోలేక వారి వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. భూ కబ్జాదారులకు అనుకూలించే విధంగా గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమల్లోకి వచ్చి ఉంటే సామాన్యుల భూములు వైసిపి నేతల పరమయ్యేవన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేశామని, దీంతో భూ యజమానులకు మంచి జరిగిందన్నారు. భూ కబ్జాదారుల నుంచి పేదల భూములను కాపాడేందుకు ల్యాండ్‌గ్రాబింగ్ చట్టాన్ని తీసుకువస్తామన్నారు. ఈ చట్టం ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో అమలులో ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో అద్యయనం చేస్తోందని, త్వరలోనే ఈ చట్టం అమలులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే భూ కబ్జాలు చేసిన వారే ఆ భూమి తమదేనని వారే నిరూపించుకోవాల్సి ఉంటుందని, కబ్జాదారులే భూమి తమదేనని నిరూపించుకునే వరకు భూమిని స్వాధీనం చేసుకునే అవకాశం లేదన్నారు. గత ఐదేళ్ళ కాలంలో వైసిపి నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూములు, ఇసుక, గనులు వంటి వాటిని కాజేశారని మండిపడ్డారు. ఆయా శాఖల నుంచి పూర్తి వివరాలు, ఆధారాలతో శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నామని, వైకాపా నాయకులు కాజేసిన భూముల విలువ సుమారు రూ.35వేల కోట్లకు పైగా ఉంటుందని, జగనన్న కాలనీల పేరుతో మరో 9వేల ఎకరాల భూమిని సొంతం చేసుకున్నారన్నారు. అదేవిధంగా ఇసుక దోపిడిలో సుమారు రూ.10వేల కోట్ల మేరా ప్రజాధనం వైకాపా రాబందుల ఖజానాకు చేరిందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పేదల కోసం నిర్మించే ఇళ్ళ కాలనీలు ఎక్కడ రావాలో వైకాపా నేతలే నిర్ణయించడం దారుణమన్నారు. పేదలను బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేయడం, లేదంటే కబ్జా చేయడం ద్వారా ఆ భూములను సొంతం చేసుకొని అవే భూములను ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి ప్రజాధనాన్ని అమాంతం మింగేశారన్నారు. వైకాపా కార్యాలయాల కోసం నామమాత్రపు లీజు పేరుతో ఏకంగా 33 ఏళ్ళ కాలానికి భూములను అద్దెకు తీసుకొని రూ.300 కోట్లకు పైగా కాజేయాలని ప్రయత్నం చేశారని, భూములను అక్రమంగా కాజేసి ప్రజా ధనాన్ని కొల్లగొట్టిన వారి నుంచి ఆ సొమ్మును వసూళ్ళు చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తామన్నారు. విశాఖపట్టణంలోని రుషికొండపై మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కోసం దాదాపు రూ.500కోట్ల ప్రజాధనంతో ఒక ప్యాలెస్ నిర్మించారని, వైకాపా నాయకులు కొండలను మింగేశారని, ఇసుక దోపిడికి అడ్డుఅదుపు లేకుండా పోయిందని, దీంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామని, దీనివల్ల సామాన్య ప్రజల సొంతింటి నిర్మాణానికి తక్కువ ఖర్చుతోనే ఇసుక లభిస్తుందని, అలాగే భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. గత ఐదేళ్ళ కాలంలో వైకాపా నాయకులు కాజేసిన ఇసుకతో రాష్ట్రంలో సుమారు 10 లక్షల గృహాలను నిర్మించవచ్చని అంచనా వేశారు. రాష్ట్రంలో పంచభూతాలను మింగిన వైకాపా నేతల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న రాష్ట్ర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపి, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని ధీమా వ్యక్తం చేశారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి బి.సి



నిత్యావసర సరుకుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో గ్రంథాలయ పట్టణ ఎపీ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని, రాష్ట్ర రోడ్డుభవనాల శాఖా మాత్యులు బి.సి జనార్ధన్ రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న నిత్యావసర సరుకులను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బి.సి కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు 9 కేంద్రాలు ప్రారంభించామని పేద ప్రజలకు రాయితీపై నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వార బియ్యం, కందిపప్పుతోపాటు నిత్యావసర సరుకులు అన్నింటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. త్వరలో ఇటువంటి కేంద్రాలను మండల కేంద్రాల్లో సైతం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కేంద్రాల ద్వార తృణ ధాన్యాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు.

## తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు చేరిక

- ఒక లక్షా 21 వేల క్యూసెక్‌ల నీరు ఇన్‌ఫ్లో
- కెపాసిటి 55 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు



తుంగభద్ర జలాశయానికి చేరిన వరద నీరు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** కర్ణాటక,ఆంధ్రా సంయుక్త జీవనాడి అయిన విజయనగర (హోస్పేట్) జిల్లా వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి గురవారం భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.జలాశయం ఎగువ ప్రాంతాలోఎడ తెరిపి లేకుండా భారీగా వర్షాలు కురుస్తుండడంతో నిన్నటి కంటే ఈ రోజు ఇన్‌ఫ్లో భారీగా పెరగింది.గురవారం సాయంత్రం నీటి లెక్కల ప్రకారం జలాశయానికి 1,21,160 లక్షల క్యూసేక్స్‌ల నీరు చేరుతుంది.కెపాసిటి 100.788 టీఎంసీలకు గాను ఇప్పటికే 55 టీఎంసీల నీటి సామర్థ్యంకు చేరింది.ఇన్‌ఫ్లో ఆధారంగా చూస్తే శుక్రవారం తెల్లవారి జామునకు 60 టీఎంసీలకు దాటోచ్చ.అవుట్ ఫ్లో 610 క్యూసేక్స్‌ల నీటిని జలాశయం నుండి వివిధ కాలువలకు వదిలారు.జలాశయం పూర్తీ నీటి మట్టం 1633 అడుగులకు గాను 1616 అడుగుల నీటిమట్టంకు చేరింది.తుంగభద్ర దిగువ కాలువ మీద ఆధారం పడిన రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

## కర్నాటకలోని నంజనగూడు శ్రీమఠంలో పీఠాధిపతులు

### -శ్రీభోదానంద సరస్వతికి, పార్లమెంటు సభ్యులు మంజునాథ్‌కి సన్మానాలు





శ్రీభోదానందసరస్వతిని పీఠాధిపతులు ఘనంగా సత్కరించి శేషవస్త్రాలలో ఘనంగా సన్మాణించారు
కర్నాటక రాష్ట్ర పార్లమెంటు సభ్యుడు మంజునాథ్ దంపతులను స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించారు

**మంత్రాలయంమేజరున్యూస్ః** కర్నాటక రాజధాని బెంగుళూరులోని జయనగర్‌లోని 5వ బ్లాకులోని నంజనగూడు శ్రీరాఘవేంద్రస్వామి మఠాన్ని సందర్శించిన కర్నాటకరాష్ట్ర పార్లమెంటు సభ్యులు మంజునాథ్ దంపతులు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను కలిశారు. ఈ సందర్భగా వారిని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సన్మాణించారు. అక్కడే ఉన్న శ్రీభోదానందసరస్వతిని పీఠాధిపతులు ఘనంగా సత్కరించి శ్రీమఠం శేషవస్త్రాలలో ఘనంగా సన్మాణించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి అనుగ్రహ ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## గుంతల రోడ్లకు మరమ్మత్తులు చేపట్టండి : ఎమ్మెల్యే

### త్రాగునీరు సక్రమంగా అందేలా చూడండి



ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

**ఆలూరు, మేజర్‌న్యూస్:** ఆలూరు నియోజక వర్గంలో ప్రధాన రహదారులు, గ్రామాలకు వెళ్లే దారులు గుంతల మయం అయ్యాయని వాటికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశించారు. గురువారం ఆలూరు విశ్రాంతి భవనంలో వారు ఆర్ అండ్ బి అధికారులు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. పట్టణంలో 15 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుందని కావున నీటి సరఫరా అధికారులు దానిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే ప్రధాన రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయం అయ్యాయని కావున ప్రజలు ఇబ్బందులు పడకుండా మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు.అలాగే వైసీపీ నాయకులతో సమావేసం అయి రాబోయే రోజుల్లో పాలక పక్షం ను ఎలా ఎదుర్కొనాలో చర్చించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ తప్పిదాలపై నిలదీయాలని అన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు అరికెర వెంకటేష్,మాదన్న సార్, మరకట్టు యల్లప్ప, భాస్కర్,వీరేష్, నాగేంద్ర, వరుణ్, లక్ష్మీనారాయణ, కొట్టాలరాజు, వీరభద్ర,రాజు లు పాల్గొన్నారు.

## రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయండి : కలెక్టర్



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్మిస్తున్న రహదారుల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్‌ఇంజనీరింగ్ అధికారులతో రోడ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1512కి.మీ రోడ్లు విస్తరించి ఉందని ఇందులో భాగంగా 172కి.మీ ప్యాచ్‌వర్క్ రోడ్ల పనులకు రూ.5.48కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారన్నారు. జిల్లాలో రూ.840కోట్లతో 94పనులు జరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ కలెక్టర్‌కు వివరించరు. ఇందులో 32పనులు పూర్తికాగా, 32పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో 12 పనులు మొదలు కావాల్సి ఉందని 18 పనులు ప్రతిపాదనల్లో ఉన్నాయని వివరించారు. నంద్యాల కలెక్టరేట్ నిర్మాణం, బనగానపల్లె బైపాస్ రోడ్డు, ఇతర ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రోడ్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ వివరించారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నాబార్డ్ కింద రూ.122కోట్లతో 26పనులు మంజూరు కాగా ఇందులో 6పనులు పూర్తికాగా 16 పనులు పురోగతిలో ఉన్నాయని మరో 4 పనులు ప్రారంభ దశలో ఉన్నాయని పంచాయతీరాజ్‌ఎస్‌ఈ కలెక్టర్‌కు నివేదించారు. ప్రధానమంత్రి గ్రామీణ స్వరాజ్ యోజన కింద రూ.23.63కోట్లతో 15పనులు మంజూరు కాగా ఇందులో 15పనులు పూర్తయ్యాయని మరో మూడు పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్టు కింద రూ.106కోట్లతో 54పనులు మంజూరయ్యాయని ఇందులో 28పనులు పూర్తికాగా 20పనులు పురోగతిలో ఉన్నాయని మరో 6 పనులు ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు. అలాగే 1057ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు కలెక్టర్ వివరించారు. మంజూరై పెండింగ్‌లో ఉన్న రోడ్డు భవన నిర్మాణాల పనులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు .